క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీ నగర్ సబ్ స్టేషన్, 11కేవీ హనుమాన్‌పేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం గురువారం ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌పేట, ఆంధ్రరత్న రోడ్డు, మల్లికార్జున వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, పోలీస్ క్వార్టర్స్, పాత గవర్నమెంట్ హాస్పిటల్, తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ప్రీ ప్రైమరీ కాన్వకేషన్ డే



సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం ప్రీ ప్రైమరీ 'కాన్వకేషన్ డే'(గ్రాడ్యుయేషన్ డే) వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్. జొన్నలగడ్డ ఆశ్రిత మాట్లాడుతూ చిన్నారులు బాల్యం నుంచే క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డిగ్రీలను అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ జాన్స్ విద్యాసంస్థల చైర్మన్ టి.మోని కాసుమన్, కార్యదర్శి, కరెస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, అకడమిక్ హెడ్స్ కె.కళ్యాణి, దీప్తి, ప్రిన్సిపాల్ లక్ష్మీకౌసల్య, ఉపాధ్యాయులు దివ్య, మోనిక తదితరులు పాల్గొన్నారు.


రచయిత తల్లాప్రగడ మృతికి సాంస్కృతిక సంస్థల సంతాపం



రచయిత తల్లాప్రగడ రవికుమార్

విజయవాడకల్చరల్: కవి, రచయిత, కాలమిస్ట్ తల్లాప్రగడ రవికుమార్ మృతికి నగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ రవికుమార్ సుదీర్ఘకాలం ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ నిర్వహించిన అనేక కార్యక్రమాలు విజయవంతం కావడానికి కృషి చేసినట్లు తెలిపారు. సాహితీవేత్త సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరమాల అనే స్వీయ కథా సంపుటిని వెలువరించారని, సినీ కవి వేటూరి సుందరరామమూర్తి కవితా సంపుటి 'సిరికాకొలను చిన్నది' అచ్చువేశాడని వెల్లడించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో జరిగిన అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ తన సంతాప సందేశంలో రవికుమార్ మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు అని అభివర్ణించారు. వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, విద్యావేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, డాక్టర్ జయంతి చక్రవర్తి, గోళ్ల నారాయణరావు సంతాపం తెలిపారు.

జక్కంపూడి కాలనీలో పోలీసుల కవాతు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో బుధవారం కేంద్ర అదనపు బలగాలు, విజయవాడ సిటీ పోలీసులు కవాతు నిర్వహించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో సాగిన కవాతులో కొత్తపేట సీఐ గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించే దిశగా, ప్రజలకు అవసరమైన ధైర్యాన్ని ఇచ్చి, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నుంచి ప్రారంభమైన కవాతు అన్ని ప్రధాన వీధుల్లో సాగింది.

స్వర్ణభారత్‌లో 28 నుంచి ఉచిత హోమియో వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో ఈ నెల 28 నుంచి మే ఒకటో తేదీ వరకు డాక్టర్ జీవీ చలపతి మెమోరియల్ హోమియోపతిక్ సెల్ఫ్ రిలయన్స్ ఫోరం సౌజన్యంతో నాలుగు రోజుల ఉచిత హోమియోపతి వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు పీవీ సత్యనారాయణరావు ట్రస్ట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తామన్నారు. అలాగే ప్రతి రెండు నెలలకు ఒక నాలుగు రోజులు హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు 94912 21119, 94403 25670 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగనన్న ప్రభుత్వంలో గడప వద్దకే పాలన

సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



31వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ శిరీష

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 31వ డివిజన్ శ్రీనగర్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నిరుపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్న పాలన మళ్లీ మనకు కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించాలని వెలంపల్లి కోరారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో తామంతా చాలా సంతోషంగా ఉన్నామని మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే గెలిపించుకుంటామని ప్రజలు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా, వాటిని పొందాలన్నా కార్యాలయాల చుట్టూ వందలసార్లు ప్రదర్శనలు చేయాల్సిన పరిస్థితిని అందరం చూశామని, కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడప వద్దకే సంక్షేమ పథకాలను తీసుకువచ్చామని గుర్తుచేశారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా సొమ్మును నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో వేయడం జరిగిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంత మంచి జరిగిందో ప్రజలంతా గమనించి ఈ ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒక్క వలంటీర్ వ్యవస్థ లేకపోతేనే రాష్ట్రంలోని దివ్యాంగులు, వృద్ధులు పింఛన్ తీసుకునేందుకు ఎన్ని అవస్థలు పడుతున్నారో చూస్తున్నామని పేర్కొన్నారు.

బొండాకు డిపాజిట్లు కూడా రావు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ఎన్ని పార్టీలు ఏకమవుతున్నాయో అందరూ గమనిస్తున్నారని అన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం ఏర్పడిన ఆ మాయ కూటమిని కూలగొట్టి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు జనమంతా సిద్ధంగా ఉన్నారన్నారు. భూ కబ్జాలకు, రౌడీయిజానికి, సెక్స్ రాకెట్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన బొండా ఉమాకు కనీసం డిపాజిట్లు కూడా రాకుండా ఓడించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమత్స సత్యం, తోట శ్రీనివాస్, బెజ్జం రవికుమార్, షేక్ నాగుల్‌మీరా, కనపర్తి కొండ తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



64వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు వైఎస్సార్ సీపీకే ఉందని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్‌ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్‌లో బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతీ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను ఆయన అందజేశారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మల్లాది విష్ణు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో అనేక రాజకీయ పార్టీలకు చెందిన వారు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, కానీ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మాత్రమే ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. నియోజకవర్గంలో శ్యాచురేషన్ పద్ధతిలో రెండు వేల మందికి ప్రతి నెలా మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్లు అందజేయడం జరిగిందని తెలిపారు. 2,420 మందికి అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని, చేయూత ద్వారా 1,620 మందికి ఆర్థిక సాయం అందజేశామని వివరించారు. సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కూడా చేయడం జరిగిందన్నారు. మిల్క్ ప్రాజెక్టు నుంచి రామవరప్పాడు వరకు ఏడు కోట్ల రూపాయలతో రోడ్లు అభివృద్ధి చేశామని అన్నారు. అదేవిధంగా తాగునీటి సరఫరా మెరుగుపర్చడం జరిగిందని, పాతపాడు–కండ్రిక రోడ్డు రూ. 3.50 కోట్లతో నిర్మించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని 21 డివిజన్లలో రోడ్లు నిర్మించామని వెల్లడించారు. 2014–19 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు ఈ విధంగా అభివృద్ధి ఎందుకు చేయలేకపోయారని మల్లాది విష్ణు ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఏమీ అభివృద్ధి చేయకుండా ఎన్నికలు వచ్చే సరికి చంద్రబాబు వైఎస్సార్ సీపీని, నాయకులను అనరాని మాటలు అంటున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి చేశాం కాబట్టే ప్రజలను ఓట్లు అడుగుతున్నామని పేర్కొన్నారు. రాబోయే అయిదేళ్లలో పరిపాలనకు సంబంధించి ఏమి చేస్తామనేది మేనిఫెస్టోలో వెల్లడించనున్నట్లు తెలిపారు. ప్రచారంలో వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు రాఘవ, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, ఎన్టీఆర్ జిల్లా పార్టీ సెక్రటరీ మేడా రమేష్, పార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, శ్రీరాములు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ఘనంగా మరకత శివలింగ వాయు ప్రతిష్ట



మరకత శివలింగ వాయు ప్రతిష్టలో గౌతంరెడ్డి, కమిటీ పెద్దలు, భక్తులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు విశేష సంఖ్యలో హాజరై రత్న ధాతు, ధాన్య యంత్ర సహిత శివలింగ ప్రతిష్టను కనులపండువగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే విచ్చేసి స్వామివారికి స్వయంగా అభిషేకాలు చేశారు. సాయంత్రం విశిష్ట అలంకరణ, అర్చనలు జరిగాయి. గౌతంరెడ్డి మాట్లాడుతూ లోక కల్యాణార్థం తలపెట్టిన మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలు కనులపండువగా జరిగాయని అన్నారు. ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేసి, స్వామివారి కృపకు పాత్రులైన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయ కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పి.శ్రీనివాసరావు, సైదులు, లఖంరాజు సునీత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి భారీ మెజార్టీ తథ్యం



వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలందరి అండతో ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్ లెనిన్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని తెలిపారు. ఎప్పుడూ బయటకు రాని వారు సైతం ఈ ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలబడేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, నందెపు సురేష్, ఎండీ హాఫీజుల్లా, బాజీ తదితరులు పాల్గొన్నారు.

2027 నాటికి మలేరియా రహిత సమాజానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 2027 నాటికి మలేరియా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 25వ తేదీ వరల్డ్ మలేరియా డేను పురస్కరించుకుని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు మాట్లాడుతూ మలేరియా వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగా నివారించడం మనందరి ప్రధాన లక్ష్యమన్నారు. 2027కి మలేరియా కేసులు లేకుండా చేసుకోవడంతో పాటు 2030 నాటికి మనదేశంలో మలేరియా కేసులు నిర్మూలించడమే లక్ష్యమన్నారు. మలేరియా నివారణ కోసం పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. దోమల లార్వా నిర్మూలన కోసం పెద్ద ఎత్తున సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు శివారు ప్రాంతాల్లో నివసించే వారు దోమ తెరలు వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వెలగలేరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, డాక్టర్ సుమ బజాజ్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సూర్యనాయక్, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



ర్యాలీలో డాక్టర్ సమరం, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి శ్రీనివాస్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఓటు అవగాహనా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన దేశం భారతదేశమన్నారు. 144 కోట్ల జనాభా కలిగిన దేశంలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రక్రియను నిర్వహించి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ఈ దేశం గొప్పతనమన్నారు. అటువంటి భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది వంటిదని చెప్పారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని తెలిపారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి, స్వీప్ నోడల్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో నిర్లిప్తతను తొలగించి ఓటింగ్ శాతాన్ని పెంచడంలో విస్తృత ప్రజాభాగస్వామ్యం అవసరమన్నారు. పవిత్రమైన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుకు సమస్త సమాచారంతో క్యూఆర్ కోడ్ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ (వీఐఎస్) అందిస్తారన్నారు. తొలుత ర్యాలీని కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్ఎస్ రెడ్డి, నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ కీర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు డి.పవన్‌కుమార్, ఎస్.సాంబశివరావు, కల్మబేగం పాల్గొన్నారు.

దుకాణదారులకు వక్ఫ్ బోర్డు నోటీసుల జారీ

పెనమలూరు: యనమలకుదురులో జన్నతుల్ బకి కబరస్తాన్, మజీద్ ఏ ఫైజ్ ఆవరణలో ఉన్న దుకాణాల లీజు యజమానులకు వక్ఫ్ బోర్డు అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈద్గా ప్రాంగణాన్ని వక్ఫ్ బోర్డు పరిధిలోకి తీసుకువస్తూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యదర్శి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 26 దుకాణాల లీజుదారులు ఇక మీదట అద్దెను వక్ఫ్ బోర్డుకు మాత్రమే చెల్లించాలని అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలిసి దుకాణాల లీజు యజమానులకు కృష్ణా జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ నహాఆలీ షా, అడిషినల్ వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ కరీముల్లా నోటీసులు జారీ చేశారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: వేసవిలో గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నిడమానూరు పంచాయితీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో బుధవారం పూర్తయిన పైప్‌లైన్ విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతం నాలుగు వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ట్యాంకులతో పాటు 17 మోటారు బోర్ల సహాయంతో తాగునీరును అందిస్తున్నామన్నారు. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో కూడా సురక్షిత తాగునీటిని అందించేందుకు పైప్‌లైన్ విస్తరణ పనులు ప్రారంభించి పూర్తి చేశామని చెప్పారు. అవసరమైన నూతన మోటారు బోర్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

చిరువ్యాపారులకు మజ్జిగ పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న చిరు వ్యాపారులకు బుధవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్ మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉన్నాయని అన్నారు. రోడ్లపైకి వచ్చే వారు ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డుపై చిరు వ్యాపారులకు తమవంతు బాధ్యతగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. నలభై రోజుల పాటు ఇదే విధంగా ప్రతి ప్రాంతంలో మజ్జిగ పంపిణీ చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కొండాయిగుంట రాము, పసుపులేటి రమేష్, పోతుల విల్సన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేయడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప చిన్న వంతెన ప్రాంతంలో మోకా నాగేంద్రరావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతను తాపీ పని చేస్తాడు. కాగా నాగేంద్రరావు, భార్య మోకా నాగలక్ష్మి ఈ నెల 23వ తేదీన ఇంట్లో నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి భార్య నాగలక్ష్మి కనిపించలేదు. ఆమె కోసం బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాహ్మణ సంక్షేమానికి అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం కృషి



ఉపనయన కార్యక్రమంలో వటువులు, నిర్వాహకులు

విజయవాడకల్చరల్: బ్రాహ్మణ సంక్షేమం కోసం అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నిరంతరం కృషి చేస్తోందని ఆ సేవా సంఘం కార్యదర్శి తాళ్లూరి వెంకట దశరథ రమేష్ అన్నారు. సేవా సంఘం ఆధ్వర్యాన సత్యనారాయణపురం సీతారామ కల్యాణ మండపంలో బ్రాహ్మణ బాలురకు ఉచిత ఉపనయన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సనాతన వైదిక ధర్మం, వేద సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరముందని తెలిపారు. నిత్యానుస్థానం ద్వారా ధర్మ మార్గం అలవడుతుందని అన్నారు. సంస్థ అధ్యక్షుడు గురునాథశర్మ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఉదయం బ్రహ్మీ ముహూర్తంలో ఉపనయన కార్యక్రమం వైభవంగా జరిగింది. బాచిప్ప నాగరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సేవా సంఘం కన్వీనర్లు యడ్లపాటి శేషసాయి, శిరీష, కోశాధికారి అనుమల రాంబాబు, సభ్యులు భమిడిపాటి గణపతి, కామర్స్ రాజేష్, ఈసీ సభ్యులు విజయలక్ష్మి, మాధవి, మూర్తి, కాశీభట్ల రవికుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు నిత్య అనుష్టానికి అవసరమైన పూజా సామాగ్రిని అందజేశారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలను ఇబ్బంది పెడుతున్నారు

టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా



మాట్లాడుతున్న బొండా ఉమా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను ప్రచారానికి వెళ్లనీయకుండా పోలీసు వ్యవస్థ ఇబ్బంది పెడుతోందని టీడీపీ విజయవాడ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా ఆరోపించారు. మొగల్రాజపురంలోని తన ఇంట్లో ఉమా బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక కూడా పోలీసులు టీడీపీ వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ కండువా కప్పుకుని పని చేసే పోలీసులపై ఇప్పటికే తాము ఈసీకి ఫిర్యాదు చేశామని, అందువల్లే ఇద్దరు ఐపీఎస్ అధికారులను ఈసీ బదిలీ చేసిందన్నారు. విజయవాడ నార్త్ ఏసీపీ డీఎస్పీ. ప్రసాద్, నున్న పోలీస్ స్టేషన్ సీఐ దుర్గాప్రసాద్ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని, ఇద్దరికీ వెలంపల్లి శ్రీనివాసరావు పోస్టింగ్‌లు ఇప్పించినందున స్వామి భక్తి చూపుతున్నారని ఆరోపించారు.

ఇప్పటికే ఇద్దరు పోలీసు అధికారులపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని, స్పందన లేనందున కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

బొండా సతీమణి అనుచిత వ్యాఖ్యలు

అధికార పార్టీ నేతలవి బుడబుక్కల మాటలన్న బొండా సుజాత



మహిళల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బొండా సుజాత(ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా సతీమణి బొండా సుజాత బుడబుక్కల సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో మహిళలతో ఆమె ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆమె అధికార పార్టీ అభ్యర్థులపై విమర్శలు చేస్తూ వారివి బుడబుక్కల మాటలంటూ ఆ సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా మాట్లాడారు. 'ఆ పార్టీలో ఒక అడ్వాంటేజ్ ఉంది. ఈ రెండు నెలలు బాగా బుడబుక్కల కబుర్లన్నీ చెప్పి.. గెలిచి వెళ్లిపోతే ఐదేళ్ల వరకు వాళ్లకు తిరుగులేదు. అలాంటి వాళ్లంటే ఆ పార్టీ అధిష్టానానికి ఇష్టమంటూ బొండా సుజాత వ్యాఖ్యానించారు. ఇటీవల టీడీపీ ఎన్నారై విభాగం కోఆర్డినేటర్ కోమటి జయరాం ఓటర్లను వెధవలు అంటూ సంబోధించిన విషయం తెలిసిందే. ఎన్నికల వేళ రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం కావాల్సిన పార్టీల అభ్యర్థులు, నాయకులు కులాల ప్రస్తావన తేవడం, వాళ్లను అవమానించే రీతిలో మాట్లాడటం కోడ్ ఉల్లంఘన అవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌కు అధునాతన సర్జరీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): దీర్ఘకాలిక అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్‌తో పాటు కార్డియో మయోపతి, మూత్రపిండాల వ్యాధులున్న మహిళలకు అధునాతన పద్ధతిలో మత్తును ఇచ్చి బ్రెస్ట్ క్యాన్సర్‌కు సర్జరీ చేసినట్లు సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు తెలిపారు. రొమ్ము క్యాన్సర్ చికిత్సలో అద్భుతమైన పురోగతిని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో ముగ్గురు హైరిస్క్ మహిళా రోగులకు వినూత్నమైన మత్తు పద్ధతిని ఉపయోగించి రొమ్ము క్యాన్సర్‌కు సర్జరీలు చేసినట్లు తెలిపారు. ఇలా 67 ఏళ్లు, 74 ఏళ్లు, 83 సంవత్సరాల వయస్సు గల మహిళలకు శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆయన వెల్లడించారు. జనరల్ ఎనస్థీషియా ఇస్తే ప్రాణాపాయం ఉన్న మహిళలకు అధునాతన మత్తు విధానం పారా వెర్టెబ్రల్ బ్లాక్, వెన్నెముక నరాల దగ్గర లోకల్ ఎనస్థీషియా అందించడం ద్వారా సోమాటిక్, సింపాథటిక్ నెర్వ్స్ ఆదుకుంటాయని ఆయన తెలిపారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన శ్రీనివాస కల్యాణం



విజయవాడకల్చరల్: సుబ్బరాజు కళాపరిషత్ తిరుపతి ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం ప్రదర్శించిన శ్రీ శ్రీనివాస కల్యాణం పద్య నాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. బ్రహ్మలోకం నుంచి మహాలక్ష్మి భూలోకానికి రావడం ఆమె వెనుకే మహావిష్ణువు రావడం, మహాలక్ష్మి పద్మావతిగా అవతరించడం, శ్రీ మహావిష్ణువు శ్రీనివాసునిగా అవతరించడం, శ్రీనివాసుని లీలలు, పద్మావతి శ్రీనివాసుల వివాహం అంశంగా నాటకం సాగింది. రచన, సంగీతం దర్శకత్వం కోనేటి సుబ్బరాజు, పద్మావతిగా సురభి హారిక, మహావిష్ణువుగా డాక్టర్ ఆమూరి సుబ్రహ్మణ్యం, భృగు మహర్షిగా కోనేటి సుబ్బరాజు, నారదునిగా కే రాధాకృష్ణతో పాటు ఇతర నటీనటులు పాత్రోచిత న్యాయం చేశారు. సంస్థ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు మాట్లాడుతూ పద్యనాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. రంగస్థల ప్రముఖులు సంగమేశ్వరరావు, సత్యనారాయణ, రాజేంద్రలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.